క్లుప్తంగా

రైతులందరూ ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలి

వేంసూరు/ఎర్రుపాలెం/తల్లాడ: కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే పథకాలు లబ్ధిపొందాలంటే ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ పోర్టల్ లో 11 అంకెల రైతు గుర్తింపు సంఖ్యను రైతులందరు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారులు రామ్మోహన్, బి.సాయి శివ, ఎండీ.తాజుద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచన మేరకు భూ భారతి పోర్టల్‌లో భూమి ఉన్న ప్రతి రైతు వారి ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబర్‌తో క్లస్టర్ ఏఈఓ వద్ద ఫార్మర్ ఐడీ నమోదు చేయించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే పీఎం కిసాన్, పీఎం ఫసల్ భీమా, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, భారతాహార భద్రత మిషన్ పథకాలకు ఫార్మర్ ఐడీ తప్పని సరి అని సోమవారం నుంచి రైతులందరు నమోదు చేయించుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం..

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరికలకు గాను దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.రజిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన గిరిజన బాలికలు బీఏ, బీకాం కంప్యూటర్స్, బీకామ్ జనరల్, బీఎస్సీ ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, లైఫ్ సైన్స్ గ్రూపులో సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల బాలికలు దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సాలి శివకృష్ణ


శివకృష్ణ

సత్తుపల్లిరూరల్: బీజేపీ సత్తుపల్లి మండల అధ్యక్షుడిగా సాలి శివకృష్ణ ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు నెల్లూడి కోటేశ్వరరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్ర అభినందనలు తెలిపారు.

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా నాగరాజు


నాగభూషణం చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న నాగరాజు

వైరా: యాదవ సంఘం వైరా మండల అధ్యక్షుడిగా తాటిపూడికి చెందిన జవాజి నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన తెలంగాణ యాదవ మహాసభలో సంఘం రాష్ట్ర నాయకుడు కూరాకుల నాగభూషణం చేతుల మీదుగా నాగరాజు నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. వైరా మండలంలో యాదవుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి తనను మండల అధ్యక్షుడిగా నియమించినందకు నాయకులు కూరాకుల నాగభూషణం, గుమ్మా రోశయ్యలకు ధన్యవాదాలు తెలిపారు.

అందాల పోటీలను రద్దు చేయాలి


మాట్లాడుతున్న ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జాన్సీ

సత్తుపల్లి: పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడుతూ ముందుకు వెళ్తున్న తరుణంలో మహిళలను అంగడిలో వస్తువులా చిత్రీకరించే అందాల పోటీలను రద్దు చేయాలని ఐద్వా పట్టణ అధ్యక్షురాలు పాకలపాటి జాన్సీ డిమాండ్ చేశారు. ఆదివారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ.2,500 భరోసారుణం ఇస్తామని 14 నెలలు గడిచినా ఇవ్వడంలో విఫలమైందని విమర్శించారు. సమావేశంలో ప్రభావతి, సమీనా, రజియాబి, నాగరత్నం, రాజ్యలక్ష్మి, షర్మిల మునిజ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ముదిగొండ: గ్రామాల్లో బీజేపీ బలోపేతం కోసం కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని బాణాపురంలోని కంఠమహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు యరబోలు వేణు గోపాల్‌రెడ్డి, వెంకయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణ గాలికేనా..!

యథేచ్ఛగా కవర్ల వినియోగం

- పర్యావరణానికి పెను ముప్పు
- భవిష్యత్ తరాలకు తప్పని పాట్లు
- నిషేధించడంలో అధికారుల వైఫల్యం


బహిరంగ ప్రదేశంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

వైరారూరల్: ప్లాస్టిక్‌ను ప్రకృతికి సహజ సిద్ధంగా లభించే అణువులతో కాకుండా కృత్రిమ విధానం ద్వారా తయారు చేస్తారు. ఈ ప్లాస్టిక్ వస్తువులు మానవ మానుగడకు తీవ్ర ఇక్కట్లను గురి చేస్తుంది. వాతావరణ కాలుష్యంతో పాటు పర్యావరణానికి ముప్పు తలపెడుతుంది. అంతేకాకుండా ప్లాస్టిక్ వస్తువును భూమిలో పాతిపెడితే 10 సంవత్సరాల తర్వాత కూడా అది యథాస్థానాన్ని కలిగి ఉంటుంది. ప్లాస్టిక్ వినియోగం వలన గుండె పెద్దది కావడం, కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకుతాయని నిపుణులు తెలుపుతున్నారు.

నామమాత్రంగా అధికారుల తనిఖీలు..

చిరువ్యాపారస్తులు నుంచి మొదలుకొని పెద్దపెద్ద వ్యాపారాలు సాగించే ప్రతి దుకాణంలో ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నా.. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుండా నామమాత్రపు తనిఖీలు చేసి సరిపెట్టుకుంటున్నారు. దీంతో పలు దుకాణదారులకు రెక్కలు వచ్చి పర్యావరణానికి ముప్పును తలపెట్టే ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తూ ప్రజా ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారని పలువురు బహిరంగానే చర్చించుకుంటున్నారు.

అంత ప్లాస్టిక్ మయమే..

ప్రతి దుకాణంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా జరుగుతుంది. కూరగాయల నుంచి ఏ సరుకులను తీసుకున్న ప్లాస్టిక్ కవర్లలోనే విక్రయిస్తున్నారు. పలు దుకాణదారులు 50 మైక్రాన్ల లోపు ఉన్న ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్నారనే వాదనలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీంతో రోడ్లపై ఎటుచూసిన ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తూ వాతావరణాన్ని కాలుష్యం చేస్తున్నాయి. గతంలో అధికారులు ప్లాస్టిక్ కవర్ల వలన కలిగే నష్టాలపై దుకాణదారులకు, వినియోగదారులకు అవగాహన కల్పించిన ప్రయోజనం లేకుండా పోతుంది. ఒక్క పల్లెలోనే కాకుండా వైరా పట్టణంలోనూ మురుగు కాలువలు, పెంట దిబ్బలుగా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇప్పటికైనా వినియోదారులతో పాటు అధికారులు ప్లాస్టిక్ కవర్లను నియంత్రించి ప్రజా ఆరోగ్యాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి..



యథేచ్ఛగా సాగుతున్న ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలపై అధికారులు పలుమార్లు అవగాహన కల్పించినా ఫలితం లేకుండా పోయింది. చిరువ్యాపారస్తుల నుంచి మొదలు ప్రతి దుకాణంలో ఏం కొనుగోలు చేసిన ప్లాస్టిక్ కవర్లనే ఇస్తున్నారు. దీంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.

– రుద్రాక్షల ఉదయ్‌కుమార్, విప్పలమడక

తనిఖీలు నిర్వహించాలి..



ప్లాస్టిక్ వినియోగం పెరుగుతున్న నేపథ్యాన ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ నియంత్రణకు దృష్టి సారించాలి. పల్లెలతో పాటు పట్టణ కేంద్రాల్లోని అన్ని రకాల దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం పరిపాటిగా మారడడం వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అధికారులు అవగాహనతో పాటు తనిఖీలు నిర్వహిస్తే కొంతైన మార్పు కలిగే అవకాశం ఉంది.

– బాణాల నర్సింహచారి, లింగన్నపాలెం

నాగులవంచలో రక్తదాన శిబిరం


నాగులవంచలో రక్తదానం చేస్తున్న దృశ్యం

చింతకాని: మండలంలోని నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఆశ్రయ సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎస్సై నాగులమీరా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, రక్తదానం చేసి చిన్నారులకు జీవితాన్ని అందించాలని సూచించారు. రక్తదానం చేసిన యువకులకు ఎస్సై ప్రశంసాపత్రాలను అందించి.. శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్న ఆశ్రయ సేవా సొసైటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకుడు ఇరుగు నవీన్, గ్రామపెద్దలు వెంకటేశ్వర్లు, బస్వయ్య, శాంతయ్య, వెంకటనర్సయ్య, రవి, నవీన్, అప్పారావు, కొండలరావు, సొసైటీ సభ్యులు రమేష్, రత్నాకర్, వసంత్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సైదులు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం


మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బోనకల్: బోనకల్ మండల పరిషత్ కార్యాలయంలో తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 100 మందికి బీపీ, షుగర్, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ట్రస్ట్ సభ్యులు తూము రోషన్ కుమార్ చేతులమీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిషలు పనిచేసిన తూము ప్రకాశరావు ఆశయాలను కొనసాగిస్తామన్నారు. తూము ప్రకాశరావు పేదలకు, దళితులకు ఆస్తి దక్కాలనే ఉద్దేశ్యంతో ఇళ్లు, ఇళ్ల స్థలాలతో పాటు భూములను పంచి పెట్టారన్నారు. ఆయన జ్ఞాపకార్థమే బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేదలకు సేవ చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆర్ఎంపీల జిల్లా అధ్యక్షుడు బొమ్మినేని కొండల్‌రావు, ఏలూరి పూర్ణ చంద్రరావు, బోళ్ల ప్రసాద్, ఆకెన పవన్, యంగల గిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయమైన ఫలితాలు


ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తల్లాడ: ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయమైన ఫలితాలు వస్తున్నాయని కుర్నవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జాన్సీరాణి అన్నారు. మండలంలోని కుర్నవల్లి, కేశవాపురం గ్రామాల్లో బడిబాటలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లను చేర్పించాలని ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది కుర్నవల్లి జెడ్పీఎస్ఎస్‌లో 37మంది పరీక్షలు రాయగా 36మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల టాపర్ హాన్సికను అభినందించారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో వస్తున్న ఫలితాలను ఒకసారి పరిశీలించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఇంటింటికీ తిరిగి అభ్యర్థించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పుల్లయ్య, రామాచారి, శివ, కిషోర్, రామకృష్ణ, రఘు తదితరులు పాల్గొన్నారు.

7నుంచి ‘విజయ’లో ఆవిష్కార్ - 2025

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 7, 8 తేదీల్లో జాతీయ టెక్నికల్, కల్చరల్ సింపోజియం ఆవిష్కార్ – 2025 నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. విజయ ఇంజనీరింగ్ కళాశాలతో పాటు రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ఈ టెక్నికల్ సింపోజియంలో పాల్గొని తమలోని కళా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 8వ తేదీ సాయంత్రం కల్చరల్ మీట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ వి.చిన్నయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆయేషాతరుణమ్ పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న జమ్ముల జితేందర్ రెడ్డి

బోనకల్: కేంద్ర విధానాలపై ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోంతు రాంబాబు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమ్ముల జితేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని రావళ్లి గ్రామంలో సీపీఎం, సీపీఐ గ్రామశాఖలు సంయుక్తంగా నిర్వహించిన మేడే వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. 8 గంటల పనిదినం సాధన కోసం ఎర్రజెండా ఆవిర్భవించిందని, ఆనాటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా దోపిడీకి వ్యతిరేకంగా ఎర్రజెండా పోరాటం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక హక్కులను కాలరాసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, సీపీఎం, సీపీఐ నాయకులు గంగదేవుల నరసింహారావు, ఏనుగు కృష్ణయ్య, నల్లమల నాగేశ్వరరావు, కొనగల్ల హనుమంతరావు, రాచకొండ కృష్ణ, ఏనుగు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం..


నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పెనుబల్లి: మండల పరిధిలోని కొత్తకారాయిగూడెం గ్రామానికి చెందిన నెల్లూరి బోధనాచారి ఇటీవల వడదెబ్బకు గురై మృతి చెందాడు. పాతకారాయిగూడెం మమతా పబ్లిక్ స్కూల్‌లో 2004 బ్యాచ్ పది విద్యార్థులు విషయం తెలుసుకొని తమవంతు సాయంగా రూ.20వేలు సేకరించి మృతిచెందిన బోధనాచారి కుటుంబానికి నగదు అందించారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న మట్టా దయానంద్

పెనుబల్లి: మండలంలోని గట్టుగూడెం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం, ముత్యాలమ్మ గుడి, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాలను ఆదివారం వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమా ఆనంద్ బాబు, పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గీతా మందిరంలో బ్రహ్మోత్సవాలు


పారాయణంలో పాల్గొన్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీగీతాజ్ఞాన మందిరంలో గల పార్థసారథి స్వామివారి ఆలయంలో ఆదివారం 19వ అధ్యాయనోత్సవ సహిత బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో సామూహిక శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, విశేష పూజలు నిర్వహించారు. ఈ నెల 8వ తేదీ వరకు అధ్యయన ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గుడివాడ వెంకటేశ్వరరావు, కొత్తూరు రాజా, తిరునగరి వెంకటనర్సయ్య, బాల లీలాకృష్ణ, నరుకుళ్ల సత్యావతి, చక్రదర్, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ముదిగొండ: అలనాటి గురువులతో పూర్వ విద్యార్థులు


పేరువంచ హైస్కూల్‌లో..

ముదిగొండ: ముదిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది చదివిన 1989–90 బ్యాచ్ విద్యార్థులు పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని అలనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆ రోజంతా సందడిగా గడిపి.. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకరిస్తామని అన్నారు.

పేరువంచ హైస్కూల్‌లో..

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన 2003 బ్యాచ్ పది విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 సంవత్సరాల తర్వాత వారంతా ఒకే చోట కలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో కనీస అవసరాల కోసం రూ.30వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, మాజీ ఎంపీటీసీ సభ్యులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, గ్రామ ప్రముకులు కీసర వీరమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ సీఐ రాధా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయానంద్‌ను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

11న మధుసూదన్‌రావు సంస్మరణ సభ


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

వైరా: మున్సిపాలిటీ పరిధిలోని కొణిజర్ల మండలం లాలాపురం గ్రామానికి చెందిన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సంక్రాంతి మధుసూదన్‌రావు సంస్మరణ సభ ఈ నెల 11న లాలాపురంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం వైరాలో చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన నిర్వహించిన డివిజన్ కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, ఎం.సాయిబాబా, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో బొంతు రాంబాబు, మాదినేని రమేష్, సుంకర సుధాకర్, తాళ్లపల్లి కృష్ణ, కొండెబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, మచ్చా మణి, దొంతెబోయిన నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లక్కీ డ్రా ద్వారా విద్యార్థులు ఎంపిక


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలోకి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ కె.వెంకట్రామయ్య ఆధ్వర్యాన విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. నాన్‌మైనార్టీలో మొత్తం 20 సీట్లకు గాను బీసీలో 10, ఎస్సీలో 5, ఎస్టీలో 3, ఓసీలో ఇద్దరు చొప్పున విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జలగం వెంగళరావు సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్

సత్తుపల్లిటౌన్: ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా జలగం వెంగళరావు అందించిన సేవలు చిరస్మరణీయం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఆదివారం మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు జయంతి సందర్భంగా పట్టణంలోని జేవీఆర్ పార్క్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, గాదె చెన్నారావు, చల్లగుళ్ల నరసింహారావు,ఎండీ కమల్ పాషా, దోమ ఆనంద్, తోట సుజలరాణి, పింగళి సామెల్,ఎండీ గఫార్‌ఖాన్, మారుతి పాల్గొన్నారు.

మండలంలో దయానంద్ పర్యటన

తల్లాడ: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పర్యటించారు. కుర్నవల్లి గ్రామంలో గంటల వెంకటనరసమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. గుర్రాల గోపాలకృష్ణారెడ్డి ఇటీవల సర్జరీ చేయించుకోగా ఆయన గృహంలో పరామర్శించారు. అన్నారుగూడెంలో గొడ్ల బాబురావు, ఉమారాణి కుమార్తె సృజన ఓణీల అలంకరణ వేడుకలో పాల్గొని ఆశీర్వదించారు. అంబేడ్కర్ నగర్‌లో ఆరాధ్య బర్త్‌డే వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎంఎసీ చైర్మన్ దోమ అనందర్‌బాబు, తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు గోవింద్ శ్రీనివాసరావు, కొమ్మినేని వెంకటేశ్వరరావు, పొన్నం కృష్ణయ్య, తుమ్మపల్లి రమేష్, గోపిశెట్టి వెంకటేశ్వరావు, అయిలూరి బాబు, బాబురావు పాల్గొన్నారు.

నివాళి..


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు

మధిర: మధిర పట్టణంలోని శ్రీకృష్ణుడి గుడి సమీపంలో నివసిస్తూ ఇటీవల మృతి చెందిన గుర్రం శివప్రసాద్ దశదినకర్మకు ఆదివారం ఎమ్మెల్సీ తాతా మధు హాజరయ్యారు. శివప్రసాద్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. ముందుగా ఎమ్మెల్సీ మధుకు దేశినేనిపాలెం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, కనుమూరు వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

శుభకార్యానికి హాజరైన మాజీ ఎంపీ..

ముదిగొండ: మండలపరిధిలోని న్యూలక్ష్మీపురంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి గడ్డం వెంకట్‌గౌడ్ మనవడి పంచకట్టు కార్యక్రమానికి మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు, నాయకులు ఆదివారం హాజరై ఆశీర్వదించారు.

ఉరుములు, మెరుపులతో వర్షం


మాటూరు క్రాస్ రోడ్ సమీపంలో రోడ్డుపై విరిగిపడిన కంపచెట్లు


మీనవోలు సమీపంలో..

మధిర: మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చీకట్లు కమ్ముకుంది. ఒక్కసారిగా ఉరుములు మెరుపులు ప్రారంభమై భారీ వర్షం కురిసింది. మాటూరు క్రాస్ రోడ్ సమీపంలో మధిర – తిరువూరు ప్రధాన రహదారిపై కంపచెట్లు విరిగిపడింది. ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.

మీనవోలు – మధిర రోడ్డులో..

ఎర్రుపాలెం: మండలంలోని ఆదివారం గాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి మీనవోలు – మధిర రోడ్డులో ఓచెట్టు విరిగి రోడ్డుపై పడింది. దీంతో వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. వాతావరణ శాఖ కూడా ముందుగానే తెలపడంతో రైతులు అప్రమత్తమై ఆరబోసిన ధాన్యంపై పట్టాలు కప్పడంతో కొంతమేర ఉపశమనం కలిగింది.